సాక్షి నంద్యాల

శుక్రవారం । 26 । మే । 2023



భక్తులతో పోటెత్తిన శ్రీమఠం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి గురువారం భక్తులు పోటెత్తారు. దాదాపు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మూల బృందావన దర్శనానికి 2 గంటల సమయం పట్టింది.



బదిలీల కోలాహలం

బదిలీల కోసం విద్యా శాఖలో 5,022 మంది, రెవెన్యూ శాఖలో 70 మంది దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ జోనల్ స్థాయిలో 22 మంది స్టాఫ్‌నర్సులు బదిలీ అయ్యారు. 8లో▸



రేవనూరులో విషాదం

నీట కుంటలో దూకి ఓ వివాహిత, యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుభకార్యానికి వచ్చి వీరు మృత్యువాత పడటంతో రేవనూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

మత్స్య సంపద యోజనను సద్వినియోగం చేసుకోండి



వాహనాన్ని లబ్ధిదారుడికి అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: చేపల పెంపకం చేపట్టాలనుకునే యువత, రైతులు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద లబ్ధిదారుడు శ్రీనివాసులకు ఐసర్ వాహనాన్ని కలెక్టర్ అందజేశారు. మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు మండలం నెహ్రూనగర్‌కు చెందిన జల్లి శ్రీనివాసులుకు రూ.21.62 లక్షలు విలువ చేసే వాహనాన్ని అందజేశామన్నారు. ఇందులో 40 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

రెండో రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రెండవ రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 14,937 మంది విద్యార్థులకు గాను 13,763 మంది హాజరు కాగా 634 మంది గైర్హాజరయ్యారు. ఒక విద్యార్థి డీబార్ అయినట్లు ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి తెలిపారు. అదే విధంగా ఒకేషనల్ 1,511 మంది విద్యార్థులకు గాను 1,437 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ రెండవ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 2,404 మంది విద్యార్థులకు గాను 2,196 మంది హాజరు కాగా 208 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యా ర్థులు 531కి గాను 512 మంది హాజరైనట్లు ఆర్‌ఐఓ పేర్కొన్నారు.

151 మంది గ్రేడ్-2 వీఆర్వోల ప్రొబేషన్ డిక్లేర్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 151 మంది గ్రేడ్-2 వీఆర్వోల ప్రొబేషన్‌ను కలెక్టర్ డాక్టర్ జి.సృజన డిక్లేర్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా గతంలో వీఆర్‌ఏ నుంచి వీఆర్వో గ్రేడ్-2గా పదోన్నతులు పొందారు. అనంతరం వారికి కేటాయించిన వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్నారు. ఈ గ్రేడ్-2 వీఆర్వోలు కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వారు. కాగా, ప్రొబేషన్‌ను డిక్లేర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడంపై ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం గ్రేడ్-2 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీవి రమణ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, జనరల్ సెక్రటరీ మద్దిలేటి హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (అర్బన్): కర్నూలు నగరంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల (ఉర్దూ బాలురు)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబీహా పర్వీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో 32, సీఈసీలో 28 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆంగ్లం, ఉర్దూ మీడియంలో ప్రవేశం కల్పిస్తామని జూన్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ యూసుఫ్ హుస్సేన్ సెల్ 9866637431ను సంప్రదించాలని కోరారు.



ఉదయానంద ఆసుపత్రి వెనుక టీడీపీ నాయకుడు కబ్జాచేసిన 50 సెంట్ల స్థలం

భూ బకాసురుల కోరలు పీకేస్తూ..

- జిల్లాలో గుట్టుగా భూముల కబ్జా
- బాధితుల ఫిర్యాదుతో కేసుల నమోదు
- కబ్జాదారుల భరతం పట్టిన ఖాకీలు
- నిందితుల్లో అధికంగా టీడీపీ నాయకులు
- ఒకే కేసులో తొమ్మిది మందికి జైలు
- ఆక్రమణదారులకు సహకరించిన నలుగురు పోలీసులపై వేటు

➡ నంద్యాల పట్టణానికి చెందిన భవనాశి వాసు పెద్ద వ్యాపారవేత్త. ఈయన కొంత కాలంగా పట్టణంలో భూములు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎస్‌బీఐ కాలనీలో కొన్నేళ్ల క్రితం 50 సెంట్ల భూమిని కొనుగోలు చేశాడు. వ్యాపార నిమిత్తం కొనుగోలు చేసిన భూమిని ఆన్‌లైన్‌లో తన పేరుపై నమోదు చేసుకోలేదు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యక్తులు పాత యజమానుల కుటుంబ సభ్యులలో ఒకరి పేరుపై రిజిస్టర్ చేయించుకుని ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకున్నారు. బాధితుడు నేరుగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులకు రెఫర్ చేసి సొంత యజమానికే చెందేలా పరిష్కారం చూపారు.

➡ పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో సర్వే నెంబర్ 68 నుంచి 313 మధ్యలో 161 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి విలువ దాదాపుగా రూ. 14 కోట్లు ఉంటుంది. స్థానిక టీడీపీ నాయకుడు గువ్వల వెంకట రమణ ఈ భూమిని తమ కుటుంబీకుల పేర్లపై నమోదు చేసుకోవాలని భావించి స్థానిక ఆర్‌ఐ శేషాద్రితో చేతులు కలిపాడు. వీరి పూర్వికుల పేర్లతో నకిలీ స్టాంప్‌లు తయారు చేయించి 1908 ఆర్‌ఎస్‌ఆర్ పుస్తకంలో ముద్రించారు. సమీపంలో జెన్‌కో సంస్థ ఏర్పాటులో 161 ఎకరాలు భూ సేకరణలో పోతే నష్టపరిహారం వస్తుందని కుట్ర పన్నారు. కుట్రను గమనించిన వీఆర్‌వో విజయ్ శ్రీనివాస్ పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణలో వారి ప్లాన్ బయటపడటంతో నిందితులను జైలుకు పంపారు.

బొమ్మలసత్రం: జిల్లాలో ల్యాండ్ మాఫియా అక్రమాలకు పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. కబ్జాదారుల కోరలు పీకేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. భూ కబ్జాలకు పాల్పడితే జైలు తప్పదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జిల్లాలో చాలా కాలంగా భూముల ధరలు ఆకాశానంటుతున్నాయి. దీంతో కబ్జారాయుళ్లు దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. సామాన్యుల స్థలం కబ్జా చేస్తే తమను ఏమి చేయలేరనే కారణంతో కబ్జాలకు తెగిస్తున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకుల భూ దందాకు ఎంతో మంది పేదలు ఆధారం కోల్పోయి రోడ్డున పడ్డారు. అధికారులను ఆశ్రయించినా న్యాయం జరుగకపోవడంతో విలువైన భూములను కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం సామాన్యులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టింది. శాంతిభద్రతల రక్షణతో పాటు బాధితుల సమస్యలను పరిష్కరించడంలో పోలీసులు ముందుంటున్నారు. సివిల్ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తున్నారు. ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా భూ తగాదాలపై పోలీసు స్పందనలో 691 ఫిర్యాదులు వచ్చాయి. బాధితులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసు అధికారుల సహకారంతో ఇప్పటి వరకు 100కు పైగా కేసులను పరిష్కరించారు. అలాగే 192 ఫిర్యాదులను కోర్టుకు వెళ్లాల్సిందిగా సూచించారు. 12కు పైగా తప్పుడు ఫిర్యాదులుగా తేల్చారు. సామాన్య ప్రజల స్థలాలు ఖాళీగా ఉన్నాయని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే ఊచలు లెక్కించాల్సిందేనని హెచ్చరిస్తున్నారు.



అధికారుల సూచనతో స్థలానికి కంచె వేసుకుంటున్న యజమాని

రిజిస్ట్రేషన్ అధికారుల నిర్లక్ష్యం..

స్థలం రిజిస్ట్రేషన్ సమయంలో కొందరు కబ్జా రాయుళ్లు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తున్నా వాటిని రిజిస్ట్రేషన్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించకుండా స్టాంప్ రైటర్లపై భారం వేస్తూ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. పత్రాలు సరైనవా? నకిలీవా? అని పరిశీలించకుండానే ఇతరుల పేర్లపై రిజిస్టర్ చేస్తున్నారు. ఈ కారణంగా జిల్లాలో భూ సమస్యలు పెరుగుతున్నాయి. ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో అప్రమత్తంగా పరిశీలించి, ఏదైనా తేడా ఉంటే రిజిస్టర్ నిలిపివేస్తే ఎటువంటి సమస్య ఉండదు.

నంద్యాల పట్టణంలోని స్థానిక ఉదయానంద ఆసుపత్రి వెనుక 50 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఓ టీడీపీ నాయకుడు కన్నేశాడు. మూలసాగరం వీధికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి వెంకట నాగసుబ్బారావు ఆయన భార్య వెంకట లక్ష్మిబాయిదిగా స్థలాన్ని గుర్తించి కబ్జాకు పావులు కదిపారు. నలుగురు స్టాంప్‌రైటర్ల సహకారంతో స్థలం యజమానులు చనిపోయినట్లుగా నకిలీ పత్రం తయారు చేయించారు. వీరికి లక్ష్మమ్మ అనే ఒక కూతురు ఉన్నట్లుగా నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పుట్టించారు. ఈ పత్రాల ఆధారంగా 50 సెంట్ల స్థలాన్ని ముగ్గురు

బతికున్న వారిని చంపేస్తున్నారు....

పేర్లపై 2020 డిసెంబర్ 18వ తేదీన నంద్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్నారు. ఈ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి 23 రిజిస్టర్‌లు చేశారు. కొన్ని రోజుల తర్వాత స్థలం అసలు యజమాని రిటైర్డ్ రైల్వే ఉద్యోగి వెంకట నాగసుబ్బారావు స్థలం వైపు వెళితే అక్కడ కొత్తగా ప్లాట్లు వేసి ఉంచారు. ఆరా తీస్తే తాను బతికుండగానే చంపేసి తనకు సంబంధం లేని ఒక మహిళను కూతురుగా సృష్టించి స్థలాన్ని కబ్జా చేశారని గుర్తించాడు. వెంటనే లాయర్ సహాయంతో స్థలం రిజిస్టర్ చేసుకున్న వారికి నోటీసులు పంపారు. ప్లాట్లు కొన్న వారు టీడీపీ నాయకుడిని గట్టిగా నిలదీయటంతో వారి నుంచి ఇతరులకు స్థలాలను విక్రయించి వారి డబ్బు వారికి తిరిగి ఇచ్చారు. ఈ క్రమంలో స్థలాన్ని కొనుగోలు చేసి మోసపోయాడు. కబ్జారాయుళ్లను నిలదీస్తే ఏకంగా చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేటుగాళ్ల డూప్లికేట్ వ్యవహారం బయటపడింది. నకిలీ మరణ ధ్రువ పత్రాలతో తప్పుడు రిజిస్టర్ చేసుకున్నట్లు గుర్తించి ఇందుకు కారణమైన టీడీపీ నాయకునితో పాటు, మరో ఎనిమిది మందిని జైలుకు పంపారు.

భూ దందాలో ఏఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

జిల్లా కేంద్రం నంద్యాలలో నకిలీ ధ్రువపత్రాలతో కొంత మంది రౌడీషీటర్లతో చేతులు కలిపి భూ దందాకు తెరలేపిన పోలీసు సిబ్బందిపై ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి గురువారం సస్పెన్షన్ వేటు వేశారు. రెవెన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి 50 సెంట్ల స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్న ముఠాను 10 రోజుల క్రితం అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో కొందరి పోలీసు సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. నంద్యాల వన్‌టౌన్ స్టేషన్ ఏఎస్‌ఐ హుస్సేన్, టూటౌన్ కానిస్టేబుల్ రవి, త్రీటౌన్ కానిస్టేబుళ్లు మాధవ, కిషోర్ రౌడీషీటర్లతో చేతులు కలిపి 50 సెంట్ల స్థలం మాత్రమే కాకుండా మరికొన్ని స్థలాలు కబ్జాలకు పాల్పడ్డారని విచారణలో తేలింది. పట్టణానికి చెందిన రామయ్యశెట్టి చాపిరేవుల టోల్‌గేట్ వద్ద 20 ఎకరాల్లో ప్లాట్లు వేశాడు. అందులో 20 సెంట్ల భూమి రిజర్వుడు స్థలంగా ఉంచాడు. ఈ స్థలాన్ని ఏఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుల్‌లు కలిసి తమ బినామి పేరు మీద నకిలీ పత్రాలు తయారు చేసి రిజిస్టర్ చేశారు. ఈ విషయం తెలుకున్న రామయ్యశెట్టి నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఎస్బీఐ కాలనీ రామకృష్ణ పీజీ కాలేజీ ఎదురుగా ఉన్న 6 సెంట్ల మున్సిపాలిటీ భూమిని కబ్జా చేశారు. అలాగే విశ్వనగర్‌లో 8 సెంట్లు, ఎస్బీఐ కాలనీలోని చెరువు కట్ట వద్ద 20 సెంట్లు కబ్జాలకు పాల్పడ్డారు. స్థల యజమానుల ఫిర్యాదుల మేరకు ఏఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



చాలామంది కేటుగాళ్లు తప్పుడు ధ్రువపత్రాల ద్వారా సామాన్యుల స్థలాలు కబ్జా చేస్తున్నారు. గతంలో స్థలం వివాదం అంటే పోలీసులు పెద్దగా చొరవ చూపేవారు కాదు. కోర్టుకు వెళ్లి స్థలం కోసం ఏళ్ల తరబడి తిరిగి ఇబ్బందులు పడేవారు. కానీ ప్రస్తుతం జిల్లాలో అలాంటి సమస్యలేదు. ఎవరైనా నకిలీ పత్రాలతో స్థలాలను కబ్జా చేశారని ఫిర్యాదు చేస్తే చాలు కబ్జారాయుళ్లపై చట్టంలో సెక్షన్‌ల ద్వారా శిక్షలు పడేలా చేస్తున్నాం. ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా వారి దగ్గరిలోని స్టేషన్‌కు వెళ్లి ధైర్యంగా ఫిర్యాదు చేయండి. అక్కడ సరైన స్పందన లేకుంటే నేరుగా నా సెల్ నెంబర్ 91211 01110కు ఫోన్ చేయండి.

– కె రఘువీర్‌రెడ్డి, ఎస్పీ, నంద్యాల జిల్లా

స్టీల్ ప్లాంట్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన, చిత్రంలో కలెక్టర్ సృజన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, ఎమ్మెల్యే కాటసాని తదితరులు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ఓర్వకల్లు: జైరాజ్ ఇస్పాత్ సౌజన్యంతో గుట్టపాడు వద్ద చేపడుతున్న స్టీల్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. స్టీల్ ప్లాంట్ పనుల పురోగతిపై మంత్రి బుగ్గనతో పాటు ఇండస్ట్రీస్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి.. కంపెనీ యాజమాన్యంతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, మరింత వేగం పెంచాలన్నారు. అందుకు కంపెనీ వారు స్పందిస్తూ.. అంతర్గత రహదారి వేయించాలని, ఐలా అనుమతి ఇప్పించాలని, నీటి సమస్యను పరిష్కరించాలని, వీధి దీపాలు వేయించాలని కోరారు. సమస్యలన్నింటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా పనులు పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంఐసీ జోనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, ఇండస్ట్రీస్ మేనేజర్ రమణారెడ్డి, స్టీల్ ప్లాంట్ అధికారులు, తహసీల్దార్ శివ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీకి సిద్ధం చేయండి

- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, అధికారులు

నంద్యాల: పాఠశాలలు తెరిచే జూన్ 12వ తేదీలోగా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన విద్యా కానుక కిట్లను సిద్ధం చేసుకోవాలని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి స్పందన అర్జీల పరిష్కారం, భూముల రీ సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నాడు నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా కానుకలో నాణ్యత లేకపోతే పరిశీలించి వెనక్కి పంపాలన్నారు. నాడు-నేడు పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. స్పందన అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 13 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసిన ఎక్సరే మిషన్లు, కంప్యూటరైజ్డ్ రేడియాగ్రఫీ సిస్టం పనిచేయని కారణంగా డిజిటల్ ఎక్సరేలు వినియోగంలో లేవని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్ థియేటర్ సంబంధించిన పరికరాలను కూడా పంపిణీ చేయాలని కోరారు. సంబంధిత కంపెనీ ఏజెన్సీలకు ఎక్సరే మిషన్ల టెక్నికల్ సమస్యలు తొలగించాలని సూచించామని, ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్ థియేటర్లలో ఉండాల్సిన పరికరాలన్నీ తెప్పించుకోవాలని కలెక్టర్‌కు జవహర్‌రెడ్డి సూచించారు. అనంతరం అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మనజీర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణ పనుల్లో 30 శాతం మాత్రమే నిధులు ఖర్చు పెట్టారని ఈ నెలాఖరులోపు మిగిలిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డోన్ ఐటీఐలో కియా ఉపాధి శిక్షణ కేంద్రం

- 29న శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్న మంత్రి బుగ్గన



కియా కార్ల కంపెనీ మిషన్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తదితరులు

డోన్: నియోజకవర్గ యువతలో వృత్తి నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కియా కార్ల కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు కాబోతుంది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా తగిన శిక్షణ ఇచ్చేందుకు కియా కంపెనీ రూ.1.60 కోట్ల విలువ చేసే పరికరాలను, మిషన్లను విరాళంగా అందజేసింది. గురువారం ఐటీఐ కళాశాలకు చేరుకున్న మిషన్లను మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో పాటు ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ధారా హరినాథ్ రెడ్డి, ఆర్ట్ రమణ, పార్టీ నాయకులు దినేష్‌గౌడ్, రఘురామయ్య, రైల్వే నాయుడు, రమేష్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపురెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఈనెల 29న ప్రారంభించనున్నట్లు మునిసిపల్ చైర్మన్ తెలిపారు. శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చిన కియా కంపెనీ ప్రతినిధులను అభినందించారు.

7న హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు తొలి విమానం

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ ప్రయాణం జూన్ 7వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మొహమ్మద్ యాకూబ్ షేఖా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి 7వ తేదీ ఉదయం 10:15 గంటలకు తొలి విమానం బయలుదేరుతుందని పేర్కొన్నారు. జూన్ 22వ తేదీ వరకు మొత్తం 46 విమానాలు నేరుగా సౌదీ అరేబియాలోని జెడ్డా విమానాశ్రయానికి చేరుకుంటాయని తెలిపారు. 38 రోజుల యాత్ర అనంతరం జూలై 15వ తేదీ నుంచి మదీనా నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి వస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే యాత్రికులు హజ్ సొసైటీల ద్వారా ప్రయాణ తేదీలను తెలుసుకోవాలని సూచించారు.

కోతల్లేకుండా కరెంట్

- అవసరాల కంటే అధికంగా విద్యుత్ సరఫరా
- కలిసివస్తున్న సోలార్, విండ్ ప్రాజెక్టుల పవర్
- అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతరాయం
- ప్రభుత్వ చర్యలతో ప్రజలకు తొలగిన ఇబ్బందులు



కర్నూలు(రాజ్‌విహార్): అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా కరెంట్ కోటాను అందిస్తోంది. గతంలో వేసవి కాలం వచ్చిందంటే తీవ్రమైన విద్యుత్ లోటు ఏర్పడి కోతలు విధించేవారు. వినియోగానికి తగిన సరఫరా లేకపోవడం, ఉత్పత్తి పడిపోవడం, ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసే అవకాశం లేకపోవడం, గ్రిడ్ లభించకపోవడం వంటి కారణాలతో వాతలు పెట్టేవారు. అధికారికంగా షెడ్యూల్ ప్రకటించి విద్యుత్ కోతలు విధించేవారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోతే ఎడాపెడా సరఫరా నిలిపివేసేవారు. ఎండ వేడిమి కారణంగా ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయేవారు. కరెంటు పోతే అసలు ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితి ఉండేది. నేడు పరిస్థితులు మారాయి. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో విద్యుత్ వ్యవస్థ మెరుగుపడింది. సోలార్‌తో పాటు విండ్ పవర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ పుష్కలంగా ఉత్పత్తి అవుతోంది. ఫలితంగా కోతలకు చెక్ పడింది. గాలి, వర్షాలు, సాంకేతిక సమస్య వంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు మాత్రమే సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ లైన్‌మెన్ల పోస్టులను భర్తీ చేయడంతో క్షేత్ర స్థాయిలో కరెంట్ సమస్యలు తొలగిపోయాయి.

అధికంగా కేటాయింపు

విద్యుత్ ఉత్పత్తి, లభ్యత, వాడకాన్ని బట్టి కోటా కేటాయిస్తారు. ఉత్పత్తి సంస్థల నుంచి కొనుగులు చేసే ట్రాన్స్‌కో ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీ ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ సంస్థలకు వారి వారి అవసరాల మేరకు కోటాగా కేటాయిస్తుంది. ఆయా సంస్థలు జిల్లాలకు రోజువారి కోటాగా కేటాయిస్తాయి. మే నెలలో కర్నూలు, నంద్యాల జిల్లాల అవసరాల కోసం 420.670 మిలియన్ యూనిట్లు (ఎంయూ) కేటాయించారు. ఇందులో ప్రతి రోజు 13.570 మిలియన్ యూనిట్లు వాడుకునేందుకు కోటాగా పెట్టుకొని వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. ఈ రెండు జిల్లాలకు రోజుకు 10 ఎంయూ నుంచి 13 ఎంయూ యూనిట్ల వరకు అవసరం కాగా.. అంత కంటే అధికంగా 13.570 ఎంయూలు కేటాయించడంతో ఇంకా విద్యుత్ మిగులుతోంది. ఈ నెల 19న అత్యధికంగా 14.194 ఎంయూలు వాడుకున్నా.. ఎక్కడా సమస్యకు తావు లేకుండా జాగ్రత్త పడ్డారు.

కలిసివస్తున్న సోలార్, విండ్ ప్రాజెక్టుల పవర్

సాధారణంగా వేసవి కాలంలో జలాశయాల్లో నీరు తక్కువగా ఉండి హైడల్ (జల శక్తి) ఉత్పత్తి తగ్గుతుంది. ప్రత్యామ్నాయంగా థర్మల్ (బొగ్గు), సోలార్ (సూర్యరశ్మి), విండ్ (గాలి మరలు) పవర్ ప్రాజెక్టుల ఉత్పత్తిని పెంచి, వాటిని వినియోగంలోకి తీసుకుంటారు. జిల్లాలో ఏర్పాటు చేసిన సోలార్, విండ్ పవర్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి పుష్కలంగా ఉండడంతో విద్యుత్ సమస్యలకు చెక్ పడిందని అధికారులు చెబుతున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతరాయం

లోటు లేని కారణంగా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా రోజువారీ షెడ్యూల్ కోతలు విధించడం లేదు. గాలి, వర్షాలు, బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ వంటి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతరాయం ఏర్పడుతోంది. తాత్కాలికంగా ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు స్థానిక అధికారులు చర్యలు చేపడుతున్నారు.

విద్యుత్ కనెక్షన్ల వివరాలు..

	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
గృహ	6,75,413	5,40,223
వ్యవసాయ	1,09,330	1,06,488
వాణిజ్య	84,189	59,289
వీధి దీపాలు	7,084	7,511
జనరల్	5,538	5,409
చిరు పరిశ్రమలు	3,674	6,298
కుటీర పరిశ్రమలు	619	11,641
భారీ పరిశ్రమలు	417	273

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 245 సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా అందిస్తున్నారు

అధికారికంగా కోతలు లేవు



కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎక్కడా అధికారికంగా విద్యుత్ కోతలు లేవు. రోజువారి 13.570 మిలియన్ యూనిట్ల విద్యుత్ వస్తోంది. అయితే జిల్లాలో వినియోగం మాత్రం 10 నుంచి 13 మిలియన్ యూనిట్ల వరకు ఉంటోంది. తాత్కాలిక సమస్యలు ఏర్పడినప్పుడు మాత్రమే తప్ప అధికారికంగా కోతలు విధించడం లేదు. విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

– ఎం. ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ, కర్నూలు

రేవనూరులో విషాదం

- నీటి కుంటలో దూకి వివాహిత, యువకుడి ఆత్మహత్య
- మృతులు నంద్యాల వాసులు
- శుభకార్యానికి వచ్చి కుంటలో దూకి బలవన్మరణం


మృతి చెందిన పర్వీన్, భార్గవ్


మృతదేహాలను పరిశీలిస్తున్న కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి

కోవెలకుంట్ల: రేవనూరు గ్రామంలో గురువారం నీట కుంటలో దూకి ఓ వివాహిత, యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సీఐ నారాయణరెడ్డి అందించిన సమాచారం మేరకు.. నంద్యాల పట్టణంలోని టెక్కె కాలనీలో నివాసం ఉంటున్న ఉసేన్‌బాషా, మౌలాబీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. పెద్దకుమార్తె పర్వీన్ (21)ను ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన మహమ్మద్ ఆసిఫ్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం జరిపించాడు. వివాహం జరిగిన మూడు నెలలకే వారు నంద్యాలకు వచ్చి స్థిరపడ్డారు. వీరికి మూడేళ్ల రియాన్ సంతానం. ఆసిఫ్ పట్టణంలో వ్యాపార దుకాణంలో గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదే కాలనీలో నివాసం ఉంటున్న లలితమ్మ కుమారుడు భార్గవ్(25) అనే యువకుడు కొన్ని నెలల నుంచి పర్వీన్‌తో సన్నిహితంగా ఉంటున్నాడు. గురువారం కోవెలకుంట్ల మండలం రేవనూరులో ఉసేన్ బాషా చిన్న కుమార్తె ఆక్సాఫాతిమా కేశఖండన మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి పర్వీన్‌తోపాటు భార్గవ్ వచ్చాడు. ఈ విషయమై తండ్రి ఉసేన్‌బాషా బంధువుల సమక్షంలో కుమార్తెను మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన పర్వీన్ అందరూ చూస్తుండగానే పక్కనే ఉన్న నీటి కుంటలో దూకింది. ఆమెను కాపాడేందుకు బంధువులు ప్రయత్నించారు. కాగా కుంటలో పూడిక ఉండటం, నీరు ఎక్కువగా ఉండటంతో లోపలికి వెళ్లలేకపోయారు. పర్వీన్ నీట మునిగి పోవడంతో అక్కడే ఉన్న భార్గవ్ మనస్తాపం చెంది కుంటలోకి దూకాడు. ఇరువురు నీట మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని నీటి కుంటలోని మృతదేహాలను వెలికి తీయించి శవపరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. శుభకార్యానికి వచ్చి అప్పటి వరకు ఆనందంగా ఉన్న కుటుంబీకులు, బంధువులు ఈ ఘటనతో విషాదంలో మునిగిపోయారు.

దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

- ఆరుగురికి గాయాలు.. బాలిక పరిస్థితి విషమం


కారు-బొలెరో ఢీ కొన్న దృశ్యం


ప్రమాదంలో గాయపడిన కర్ణాటక వాసులు

ఎమ్మిగనూరురూరల్: దైవదర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో బాలిక పరిస్థితి విషమంగా ఉంది. కర్ణాటక రాష్ట్రం బెల్గాం చెందిన సురేష్, ద్రాక్షాయని, పార్థన(11), జస్వంత్(12), గంగారాం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి బుధవారం రాత్రి వచ్చారు. గురువారం ఉదయం దర్శనం ముగించుకొని శ్రీశైలానికి కారులో వెళ్తున్నారు. కృష్ణగిరికి చెందిన రాఘవేంద్ర తన కుమార్తె నామకరణం కోసం బొలెరో వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయానికి వస్తున్నారు. రాళ్లదొడ్డి-గోనెగండ్ల మధ్య బట్ల మారెమ్మ దేవాలయం సమీపంలో ముందుగా వెళ్తున్న లారీని దాటేందుకు వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బెల్గాంకు చెందిన సురేష్, ద్రాక్షాయని, పార్థన, జస్వంత్, డ్రైవర్ గంగారాంకు తీవ్ర గాయాలయ్యాయి. బొలెరో ఉన్న కత్తి రమేష్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ కర్ణాటక వాసులను 108 వాహనాల్లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన బాలిక పార్థన(11) పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాద విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ పి. నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

సంతానం కలగలేదని..


మృతి చెందిన పానుగుంటి ప్రవీణ్ కుమార్

మిడుతూరు: సంతానం కలగలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. చెరుకుచెర్ల గ్రామానికి చెందిన పానుగంటి ప్రవీణ్ కుమార్(27)కి నాలుగేళ్ల క్రితం ప్రత్యూషతో వివాహమైంది. వీరు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కాగా ఇప్పటి వరకు సంతానం కలగక పోవడంతో ప్రవీణ్‌కుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గురువారం తెలిపారు.

దాయాదుల మధ్య ఘర్షణ

ఎమ్మిగనూరురూరల్: ఆస్తి విషయంలో దాయాదుల మధ్య ఘర్షణ జరిగి నలుగురికి గాయాలయ్యాయి. కడిమెట్ల గ్రామానికి చెందిన పెద్దచెన్నప్ప, శంకరన్న, కేశన్నలు అన్నదమ్ములు. వీరి మధ్య కొన్ని రోజులుగా 10 ఎకరాల పొలం పంపకంలో గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై పెద్దచెన్నప్ప, శంకరన్న.. కేశన్న కుమారులు చంద్ర, చెన్నప్పల మధ్య గురువారం సాయంత్రం మాటామాట పెరిగింది. పరస్పరం దాడులు చేసుకోవడంతో పెద్దచెన్నప్ప, శంకరన్నకు, కేశన్న కుమారులు చెన్నప్ప, చంద్రలకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మహానందీశ్వరస్వామికి రూ. అరకోటి నష్టపరిహారం


మహానంది ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి చెక్కును అందిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

మహానంది: సుమారు పదిహేనేళ్ల నుంచి మహానందీశ్వర దేవస్థానం చేస్తున్న ప్రయత్నం ఫలించింది. మహానంది దేవస్థానానికి చెందిన నంద్యాలలోని మూలసాగరం పరిధిలో సర్వే నెంబర్ 487లో 9.44 ఎకరాల భూముల్లో భాగంగా 6.97 ఎకరాలు కుందూ పరివాహక విస్తరణకు కేటాయించారు. దీంతో నష్టపరిహారం కోసం అప్పటి నుంచి అధికారులు కృషి చేస్తూనే ఉన్నారు. ఈ విషయంపై శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి పర్యవేక్షించడంతో రూ. 49,00,578 మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం ఆర్‌డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నష్టపరిహారానికి సంబంధించి చెక్కును అందించారు. సుమారు పదమూడేళ్ల నుంచి చేస్తున్న ప్రయత్నంలో భాగంగా దేవస్థానానికి దాదాపు రూ.అరకోటి మంజూరు కావడం విశేషం. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ వృద్ధురాలు డోన్ పట్టణ వాసి

వెల్దుర్తి: ముళ్ల పొదల్లో అచేతనంగా పడి ఉన్న వృద్ధురాలిని గుర్తించిన వెల్దుర్తి యువకులు ఆసుపత్రికి చేర్చిన విషయం తెలిసిందే. పత్రికల్లో వచ్చిన వార్త ఆధారంగా వృద్ధురాలిని గుర్తించి డోన్‌కు చెందిన ఆమె కుమారుడు గురువారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. రెండు రోజుల క్రితం డోన్ నుంచి కర్నూలుకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరిందని, తర్వాత ఇంటికి రాలేదని ఆ యువకుడు చెప్పాడని ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మతిస్థిమితం సరిగా లేదని తెలిపాడన్నారు. తన తల్లిని కాపాడిన యువకులను, వెల్దుర్తి వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడన్నారు. అయితే యువకుడి, అతని తల్లి పేరు తెలియరాలేదన్నారు. ఆ యువకుడు హడావుడిగా కర్నూలుకు వెళ్లినట్లు ఎస్ఐ చెప్పారు.

తాలూకా పోలీస్‌స్టేషన్‌కు అఖిల ప్రియ

బొమ్మలసత్రం: టీడీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితురాలిగా ఉన్న మాజీ మంత్రి అఖిల ప్రియ గురువారం తాలూకా పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు. ఈ కేసులో రిమాండ్‌లో ఉండగా బుధవారం కోర్టు కండీషన్ బెయిల్ మంజూరైంది. కాగా ప్రతి గురు, ఆదివారాల్లో నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్‌లో సంతకం చేయాల్సిందిగా కోర్టు షరతులు విధించింది. ఈ నేపథ్యంలో గురువారం అఖిలప్రియ తన అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తనను అన్యాయంగా కేసులో ఇరికించారని, త్వరలో సాక్ష్యాధారాల ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాలుకు రూ.లలో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
వేరుశెనగ	6070	7578
పొద్దుతిరుగుడు	2699	4329
ఆముదం	5189	5309
ఎండుమిర్చి	4899	18309
శనగలు	3190	4569
కందులు	7262	8640
మొక్కజొన్న	1129	1776
మినుములు	7530	7530
సోయా చిక్కుడు	3319	3319

నేటి నుంచి మంత్రి బుగ్గన విస్తృత పర్యటన

డోన్/బేతంచెర్ల: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు విస్తృతంగా పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభం, భూమి పూజ చేయనున్నారు. బుధవారం ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ వరకు 53 కిలోమీటర్ల మేర ఎస్‌హెచ్ 340బీ సుమారు రూ. 650 కోట్లతో నిర్మించే రహదారి నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. అనంతరం బేతంచెర్ల పట్టణంలోని జగనన్న కాలనీకి రోడ్ కం బ్రిడ్జిని ప్రారంభిస్తారన్నారు. ఆ తర్వాత డోన్ పట్టణం గుత్తి రోడ్డులోని శాన్‌జో స్కూల్ వద్ద 44వ జాతీయ రహదారి వద్ద 340బీ జాతీయ రహదారి లింకు రోడ్డు పనులకు భూమిపూజ చేస్తారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.1.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన నూతన ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారు.

- 27వ తేదీన ప్యాపిలి మండలం గోపాలనగరం నుంచి ఊటకొండ వరకు రూ.1.50కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించి పాదయాత్ర చేస్తారన్నారు. అనంతరం జలదుర్గం నుంచి డోన్ వరకు నిర్మించే ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తారు. అనంతరం ప్యాపిలిలో కార్యకర్తలు, పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొంటారు.
- 28వ తేదీన స్థానిక కంబాలపాడు సర్కిల్‌లో పునః ప్రతిష్ఠించిన దివంగత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం మండలంలోని మిద్దెపల్లె, ఎద్దుపెంట రోడ్డును ప్రారంభించి పాదయాత్ర చేయనున్నారు. అలాగే ఎద్దుపెంట గ్రామంలో వాటర్‌షెడ్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం గుండాల గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించనున్నారు.

జూన్ 1 నుంచి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ఉత్సవాలు

కర్నూలు(లీగల్): ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అమరావతి సూచనల మేరకు జాతీయ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన వేడుకలు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకట నాగశ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం న్యాయ సేవా సదన్‌లో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల హక్కులు, అత్యంత హాని మరియు అట్టడుగున ఉన్న వారి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. ఉత్సవాల విజయవంతానికి ఆయా జిల్లాల్లో డీఎల్ఎస్‌ల కార్యదర్శులందరినీ నోడల్ అధికారులుగా నామినేట్ చేశారు. వేడుకల్లో భాగంగా మే 25, 26 తేదీల్లో ఎన్‌సీపీసీఆర్ నిర్వహించనున్న వర్చువల్ సమావేశంలో పాల్గొనేందుకు డీఎల్ఎస్‌ల కార్యదర్శులను అనుమతిస్తారన్నారు.

THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD
Door No. 46-1-C, Budhawarpeta, Opp: Govt. Regional Eye Hospital, KURNOOL - 518002
E.Mail : ceo_kml@kurnooldccb.com Fax No. 08518-255510
ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి.,
ఇంటి నెం. 46-1-సి, బుధవారపేట, ప్రభుత్వ కంటి హాస్పిటల్ ఎదురుగా, కర్నూలు - 518 002.

ఖాతాదారులకు విజ్ఞప్తి

బ్యాంకు CBS సాఫ్ట్‌వేర్ నుండి టి.సి.ఎస్‌నకు మారిన కారణముగా పాత ఖాతా నెంబరుకి బదులుగా క్రొత్త ఖాతా నెంబరు కేటాయించబడినది. కావున అందరు ఖాతాదారులకు తెలియచేయటం ఏమనగా RTGS/NEFT మరియు ఇతర లావాదేవీలు (DBT, Subsidy, LIC, PFMS, Loans, IT Returns) వంటి వాటి కోసం కేవలం క్రొత్త ఖాతా నెంబరును మాత్రమే వినియోగించవలెను. పాత ఖాతా నెంబరును వినియోగించిన యెడల తేది. 31.05.2023 నుండి లావాదేవీలు విఫలమవునని లేదా తిరస్కరించబడునని తెలియజేయడమైనది. క్రొత్త ఖాతా నెంబరు కొరకు సంబంధిత బ్రాంచిని సంప్రదించగలరు.

సం/- పి.రామాంజనేయులు, ముఖ్య కార్యనిర్వహణాధికారి

విద్యాశాఖలో బదిలీల కోలాహలం

- ఇప్పటివరకు బదిలీలకు 5,022 దరఖాస్తులు
- కచ్చితంగా బదిలీ అయ్యేవారు 1,364 మంది
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు


పదోన్నతులు, బదిలీల కోసం డీఈఓ ఆఫీస్‌లో గుమిగూడిన టీచర్లు

కర్నూలు(సిటీ): విద్యా శాఖలో ఉపాధ్యాయుల బదిలీల సందడి నెలకొంది. బదిలీల కోసం మొత్తం 5,022 (గురువారం సాయంత్రం 6 గంటల వరకు) మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8 సంవత్సరాల పాటు ఒకే స్కూల్‌లో పనిచేస్తున్న వారు 1,364 మంది ఉన్నారు. మిగిలిన 3,658 మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. డీఈఓ పూల్‌లో ఉండి విరుద్ధ పోస్టులలో పనిచేస్తున్న భాషా పండిట్లు, పీఈటీలు, 8 సంవత్సరాల పాటు ఒకే చోట పనిచేస్తున్నవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఒకవేళ ఎవరికైనా సమాచారం లేకపోతే ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయుల బదిలీల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉంది. ఆ తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబోమని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

డీఈఓ వెబ్‌సైట్‌లో పదోన్నతుల జాబితా

అర్హులైన స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు ఇస్తున్నారు. ఇందుకు అంగీకార పత్రాలను తీసుకున్న వారి వివరాల ప్రకారం తుది సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీరికి శుక్రవారం కడప ఆర్‌జేడీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సెకండ్ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు ఇప్పటికే వెబ్‌సైట్‌లో అర్హుల వివరాలతో కూడిన సీనియారిటీ జాబితాలను అందుబాటులో ఉంచారు. ఈ జాబితాలో ఉన్నవారు పదోన్నతులు తీసుకునేందుకు అంగీకారం తెలపడం లేదంటూ నాట్ విల్లింగ్ ఫారాలను అందజేస్తున్నారు. మొదటిరోజున ఇంగ్లిష్ 346 , గణితం 307, బయోలాజికల్ సైన్స్ 415, ఫిజికల్ సైన్స్ 566, సోషల్ స్టడీస్‌లో 639 మంది నాట్ విల్లింగ్ ఇచ్చారు. అయితే కొంతమంది మళ్లీ తమకు పదోన్నతులు కావాలంటూ అంగీకార పత్రాలు అందజేస్తున్నారు. శుక్రవారానికి విల్లింగ్, నాట్ విల్లింగ్‌లపై పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

పదోన్నతులతో 1,251 సబ్జెక్టు టీచర్ల భర్తీ అయ్యే అవకాశం

జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల స్కూళ్లతో పాటు మున్సిపల్ యాజమాన్య ఉన్నత పాఠశాలలు 248 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 3,245 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంకా జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 1,562 పోస్టులు ఖాళీ ఉన్నట్లు విద్యాశాఖ నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న పదోన్నతులలో 1,130 వివిధ సబ్జెక్టు టీచర్ల, 121 ప్రధానోపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. గతంలో జారీ చేసిన వివిధ డీఎస్సీ నోటిఫికేషన్లలో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ పోస్టులు, మంజూరై ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టు టీచర్ పోస్టులు 311 ఖాళీలు ఉన్నాయి.

మార్కెటింగ్ శాఖలో..

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖలో గురువారం బదిలీల ప్రక్రియను చేపట్టారు. అన్ని క్యాడర్‌ల బదిలీలు గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌లోనే నిర్వహించారు. ఈ ప్రక్రియలో పాల్గొనేందుకు జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి కూడా గుంటూరు వెళ్లారు. గత ఏడాదే బదిలీలు జరిగినందున ఈ సారి బదిలీలు స్వల్పంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. జిల్లాలో నలుగురు సూపర్‌వైజర్లను బదిలీ చేసినట్లు తెలిసింది. ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి డిపార్టుమెంటుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. మార్కెటింగ్ శాఖలో డీడీ అయిన ఈయన ఆదోని మార్కెట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనే డిపార్టుమెంటుకు వెళ్లడానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి ఆదోని మార్కెట్ కమిటీకి బదిలీ కానున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

రెవెన్యూ శాఖలో..

కర్నూలు(సెంట్రల్): బదిలీల కోసం రెవెన్యూ శాఖలోని వివిధ క్యాడర్లలో పనిచేసే 70 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరారావు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ..ఐదేళ్ల సర్వీసు ఒకే చోట పూర్తయిన వారిని కచ్చితంగా బదిలీచేస్తామన్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తయితే రిక్వెస్టు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 26వ తేదీలోపు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వైద్య ఆరోగ్యశాఖలో..

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో పరస్పర అంగీకార బదిలీలు ప్రారంభమయ్యాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెల్త్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న సాయిరామ్, మాధవరాజు పర్ల పీహెచ్‌సీకి, అక్కడ పనిచేస్తున్న జి. కృష్ణమూర్తి, గోవిందు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు. అలాగే ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న జి. షణ్ముకుడు పర్లకు, అక్కడ పనిచేస్తున్న పి.సుభాషిణి కంటి ఆసుపత్రికి బదిలీ అయ్యారు. అలాగే జోనల్ స్థాయిలో 22 మంది స్టాఫ్ నర్సులు బదిలీ కాగా అందులో ఏడుగురు కర్నూలు, ఒకరు నంద్యాల జిల్లాకు బదిలీ చేస్తూ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సామూహిక ఉపనయనం


ఉపన్యసిస్తున్న పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లోని నంజానగూడు శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో మంత్రాలయం పీఠాధిపతి శ్రీసుభుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో గురువారం సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించారు. నూతన వటులందరికీ పీఠాధిపతులు అనుగ్రహ మంత్రాక్షితలతో ఆశీర్వచనాలు చేశారు.

విధుల్లో చేరిన విజిలెన్స్ ప్రాంతీయ అధికారి


బాధ్యతలు చేపట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నీలం పూజిత

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారిగా నియమితులైన (ఆర్‌వీఈఓ) నీలం పూజిత బాధ్యతలు చేపట్టారు. నెల రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎస్పీల బదిలీల్లో ఇక్కడున్న తిరుమలేశ్వర్‌రెడ్డి నెల్లూరుకు బదిలీ అయ్యారు. కడప స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా పనిచేస్తున్న నీలం పూజితను కర్నూలు విజిలెన్స్ విభాగానికి నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ కావడంతో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా ఎద్దులపల్లెకు చెందిన ఈమె 2012 గ్రూప్-1 బ్యాచ్ అధికారి. ప్రొద్దుటూరు, తెలంగాణ రాష్ట్రంలోని సూర్యపేట, హైదరాబాద్ సిటీ సెంట్రల్ క్రైం స్టేషన్, కర్నూలు సీఐడీ, కడప జిల్లా ప్రొద్దుటూరు డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది కడప సెబ్ విభాగంలో పనిచేస్తుండగా తాజా బదిలీల్లో ఆమెను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ఆర్‌వీఈఓగా నియమించారు. ఈ సందర్భంగా సీఐలు కేశవరెడ్డి, సునిల్‌కుమార్, డీఈ గుణకర్‌రెడ్డితో పాటు సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. కలసికట్టుగా ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేద్దామని తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ నిర్వాకం

- మున్సిపల్ కమిషనర్ బదులు తానే సంతకం
- విచారణ జరుగుతున్న వైనం

నంద్యాల(సిటీ): దరఖాస్తుపై నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సంతకం చేయాల్సి ఉండగా అక్కడ పని చేసే ఓ జూనియర్ అసిస్టెంట్ సంతకం చేసి కమిషనర్ ఆధార్ అనుసంధానం చేయడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టణంలోని అంకాల్‌పేట, బైర్మల్ స్ట్రీట్‌లో ఉన్న మున్సిపల్ షాప్ నెంబర్-1కు 2కేవీ విద్యుత్ కనెక్షన్ కోసం ఈనెల 24వ తేదీన నంద్యాల ఏపీఎస్పీడీసీఎల్ డివిజన్-1 వారికి చేసిన దరఖాస్తులో మున్సిపల్ కమిషనర్ సంతకం బదులుగా అక్కడ పని చేసే జూనియర్ అసిస్టెంట్ సంతకాన్ని ఫర్ కమిషనర్ అని రాసి, కమిషనర్ ఆధార్‌ను అనుసంధానం చేసి దరఖాస్తు చేశారు. ఇటీవల మహానంది మండలంలో వక్ఫ్‌భూముల విషయంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంతకం ఫోర్జరీ కేసు పూర్తిగా తేలకముందే నంద్యాలలో మరో ఉన్నతాధికారి సంతకం ఇలా జరగడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కమిషనర్ అందుబాటులో లేనందున తానే సంతకం పెట్టానని జూనియర్ అసిస్టెంట్ చెబుతుండగా, అలా చేయడం చట్టరీత్యా నేరమని, పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని కమిషనర్ పేర్కొన్నారు.

మహిళ బలవన్మరణం

హాలహర్వి: బిల్లేహాల్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన కృష్ణమూర్తి, ఇందిర(24)కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కుటుంబ సమస్యలతో ఇద్దరూ తరచూ గొడవ పడేవారు. గురువారం గొడవ కాస్తా పెద్దదై క్షణికావేశంతో ఇందిర ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. కుటుంబీకులు ఆలూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. ఆమె భర్త కృష్ణ మూర్తి, మామ గాదిలింగప్ప, అత్త లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నేడు సీ-క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని సీ-క్యాంపు రైతుబజారుకు ఈ నెల 26న సెలవు ప్రకటించినట్లు ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతు బజారులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో భాగంగా ప్రతి నెల ఒక రోజు రైతుబజారును మూసివేసి క్లీనింగ్ చేస్తున్నామన్నారు. క్లీనింగ్, శానిటైజ్ కార్యక్రమాలు చేపట్టేందుకు రైతుబజారును శుక్రవారం మూసివేస్తున్నట్లు తెలిపారు.

అసాంఘిక శక్తులపై నిఘా పెంచాలి


జూమ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే శక్తులపై నిఘా పెంచాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఎస్పీ ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించి మిస్సింగ్ కేసులను ఛేదించాలని సూచించారు. రాత్రి సమయంలో గస్తీని ముమ్మరం చేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. విచారణలో భాగంగా దర్యాప్తు సమగ్రవంతంగా నిర్వహించి సరైన సాక్ష్యాధారాలు సేకరించి నిందితులకు కోర్టులో శిక్షలు పడేలా చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ OSSC అటానమస్ బోర్డు వారి Open School ద్వార SSC లేదా ఇంటర్ ఒకే సంIIలో పాస్ కావచ్చు. (ఇంటర్ అన్ని గ్రూపులు కలవు) వివరాలకు – 75692 64956 [L-635]

POLICE/ARMY COACHING
■ ఆర్మీ (అగ్నిపథ్) వ్రాత పరీక్ష + ఫిజికల్ టెస్ట్‌కై 100% గ్యారెంటి శిక్షణ. ఉచిత భోజనం + రూం కలవు. (23 సంIIల అనుభవం గల సంస్థ) స్టార్ కోచింగ్ సెంటర్, నంద్యాల, సెల్ : 87908 44959 [L-799010]

PARAMEDICAL
■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1418]

REAL ESTATE

PLOT FOR SALE
■ ఓర్వకల్లు-శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30x40 (2.75 సెంట్లు) ఓపన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్షలు మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 98884 24222 [L-799004]

SERVICES
■ నగర ప్రజలకు శుభవార్త! కరెంట్ బిల్లులతో విసిగిపోతున్నారా. అయితే సోలార్ పవర్‌ని ఉపయోగించుకోండి. మీ కరెంట్ బిల్లుల నుండి ఉపశమనం పొందండి. తక్కువ మెయింటెనెన్స్‌తో 25 సంIIల వరకు కరెంటు బిల్స్‌ను 90% ఆదా చేసుకోండి. EMI సదుపాయం కలదు. శ్రీ సోలార్ పవర్ ఏజెన్సీస్. 84668 87348, 08518-254789. వర్కర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. [L-799012]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725

FOR SALE
■ మినీ సూపర్ మార్కెట్ రన్నింగ్‌లో వున్నది అమ్మబడును. కర్నూలు ధర్మపేట, దీపక్‌తేజ్ హాస్పిటల్ దగ్గర స్టాక్‌తో సహా (బిల్డింగ్ కాదు) అమ్మబడును. 91820 12969, 99124 44244 [L-799016]

ASTROLOGY
■ నేపాల్ రుద్రాక్ష మహా బండార్ అద్భుత శక్తులు, అనంత సంపదలకు ఏకముఖి నుండి బహుముఖాల అసలైన నేపాల్ రుద్రాక్షలు లభించును. మద్దూరు నగర్, కర్నూలు. సెల్: 70364 85686, 63024 30756 [L-637]

ఉచిత OP చూడ బడును
■ పల్లా హాస్పిటల్ 7 రోడ్ సర్కిల్ నందు గైనకాలజీ విభాగంలో ఉచిత సంతానోత్పత్తి OPశిబిరం 14-05-2023 to 20-05-2023 సంతానోత్పత్తి OP ఉచితంగా చూస్తారు 20% డిస్కౌంట్ తో అన్ని స్కాన్స్ ఇన్వెస్టిగేషన్ సర్వీస్ చేస్తారు. 9849040153. [C-784737]

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034424384. [H-797632]

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 73821 14647 [V-6141]

WANTED
■ ఇండస్ ఇండ్ బ్యాంక్ నందు 2 వీలర్ లోన్స్ బిజినెస్ & రికవరీ చేయుటకు యువకులు కావలెను. అర్హత: 10th ఆ పైన , సంప్ర: యస్.వి.కాంప్లెక్స్, కర్నూలు. 75694 69390 [L-799017]

■ కర్నూలు జిల్లాలో కొమ్మచెఱువు ఆంజనేయస్వామి గుడి దగ్గరలో ప్రముఖ మసురం ఫ్యాక్టరీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీ: 11500+ రూమ్, భోజనం. 95817 76921, 95817 76923 [L-799273]

■ ప్రముఖ సంస్థ నందు కర్నూలు, నంద్యాల, ఆదోనిలో సెక్యూరిటీ గార్డ్స్, ఆయాలు, టెలికాలర్స్, కంప్యూటర్, ఆఫీస్ బాయ్ కావలెను. సంప్ర: 88867 69416, 89195 60049 [L-799274]

■ టూ వీలర్ షోరూం నందు అనుభవం కల్గిన అకౌంటెంట్, టాలీ ఆపరేటర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, సంప్ర: R&M SUZUKI బంగారుపేట, కర్నూలు. సెల్: 87126 13148 [L-799276]

■ నంద్యాల శ్రీ వాసవి హైస్కూల్‌లో పనిచేయుటకు అనుభవం గల మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజి, క్వాలిఫైడ్ కల్గిన ప్రైమరీ టీచర్స్ మరియు హాస్టల్ కేర్ టేకర్స్ కావలెను. సంప్ర: 96426 67906, 94415 18586 [L-799275]

■ కర్నూలు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల వారికి మా సంస్థలో పనిచేయుటకు 29 స్త్రీ/పు కావలెను. అర్హత: 10th,డిగ్రీ, ITI డిప్లొమా (P/F) జీ: 13 వేలు+ కమీషన్ 6 వేలు+ బోనస్+ ఫ్రీ రూం. సెల్: 95502 50229 [L-799267]

■ నంద్యాల, నంద్యాల జిల్లా పరిధిలోని అర్బన్ & రూరల్ డెవలప్‌మెంట్ ఆన్‌లైన్ సర్వే చేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (M/F) జీతం: 10K సంప్ర: 81062 54940 [L-799272]

■ Receptionist/లేడి హెల్పర్స్ కావలెను. అర్హత: 10th/ANM, 10am-8pm శ్రీ సాయి బాలాజీ డెంటల్ క్లినిక్, రోడ్ నెం.4, వెంకట రమణ కాలనీ, కర్నూలు. సెల్: 98852 53819 [L-636]

■ Wanted Lady Teachers to teach all Subjects (EM) for Global E.M. School, Budhawarapeta, Kurnool. Preference to local teachers. 85559 26418 [L-799269]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786357]

■ డైరెక్ట్ జాబ్ 18-50 సం.ల మహిళలు/మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఉచిత వసతి+భోజనం+ జీతం: 16000-30000 వేల వరకు. స్పాట్ జాయినింగ్. ఫోన్: 8886733005. [H-781493]

■ ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మా సంస్థను మీజిల్లాలోఅభివృద్ధి చేయగలిగేవారు కావలెను. Mega Group Man Power & Security. Conact: 70326 10569, 70931 25169. [NA-5620]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221302]

■ ఎర్రచందనం సాగులో అగ్రగామి కంపెనీ నందు ఫామ్ ల్యాండ్స్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పు కావలెను. అనుభవం లేనివారు కూడా సంప్ర : ✆ 83410 78779 [B-1165733]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 7989951063 [G-786358]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q.5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995374999 [HA-208]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.